# ఆలోచించి ఓటు వేయాలి

- ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు
- అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎమ్మెల్యే దానం నాగేందర్ దిశా నిర్దేశం




జూబ్లీహిల్స్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్,అక్టోబర్ 31: బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అబద్ధపు హామీలు ఇస్తున్న ప్రతిపక్ష పార్టీల వైఖరిని ఎక్కడికక్కడ ఎండగట్టాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్‌కు చెందిన బూత్‌స్థాయి కార్యకర్తలు, యువజన విభాగం కార్యకర్తలు, ముఖ్య నాయకుల సమావేశాన్ని బంజారాహిల్స్‌లోని లేక్‌వ్యూ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌తో కలిసి ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అందుకుంటున్న వారు జూబ్లీహిల్స్ డివిజన్‌లోనే సుమారు 12వేలమంది ఉన్నారన్నారు. ఆసరా, షాదీముబారక్. కళ్యాణలక్ష్మి, డబుల్ బెడ్‌రూమ్ లాంటి పథకాలను అందుకున్న వారందరూ బీఆర్ఎస్‌కు మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లోని ఓటర్లతో పాటు లబ్ధిదారులను నేరుగా కలిసి ప్రచారం చేయాలని సూచించారు. తాను సుమారు 30ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి, సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందన్నారు. ఈ ఎన్నికల్లో మరోసారి కేసీఆర్ గెలిస్తేనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా ఎన్నికల రంగంలో పనిచేయాలని, మీ వెనక నేనున్నానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జి బండ సురేష్, బీఆర్ఎస్ నాయకులు మామిడి నర్సింగరావు, కార్తీక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జూబ్లీహిల్స్ డివిజన్ కార్యకర్తలు, నాయకులు



అక్కా..! అభివృద్ధి చేశాం..ప్రేమ్‌నగర్ సాయిబాబా ఆలయం సమీపంలో ఓ మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్



వెంకటరమణ కాలనీలో ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

**ఇంటింటా దానం ప్రచారం:** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు డివిజన్లల్లో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. మంగళవారం ప్రేమ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం వెంకటరమణ కాలనీ, ఆనంద్‌నగర్ కాలనీ, చింతల్‌బస్తీ ప్రాంతాల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళా కార్యకర్తలు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్వాగతం పలికారు. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్, ఇందిరానగర్ తదితర బస్తీల్లో కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. –బంజారాహిల్స్, అక్టోబర్ 31

## స్వచ్ఛ ఆటోటిప్పర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖైరతాబాద్, అక్టోబర్ 31 : గ్రేటర్‌లోని స్వచ్ఛ ఆటోటిప్పర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ ఆటో టిప్పర్, రిక్షా కార్మికుల జేఏసీ చైర్మన్ ఈ. సూరన్న కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక మందికి స్వచ్ఛ ఆటోటిప్పర్లు కేటాయించారన్నారు. తద్వారా లక్షలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. చెత్త తరలించే క్రమంలో కార్మికులు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. వారి ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు స్వచ్ఛ ఆటో కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జేఏసీ ఫౌండర్ చైర్మన్ వీరేశ్, నాయకులు పాల్గొన్నారు.

## బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శిగా విజయరాజు

ఖైరతాబాద్, అక్టోబర్ 31 : బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శిగా భట్టు విజయరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు సంగెం సూర్యారావు నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలోని బీసీలందరినీ ఏకతాటిపైకి తీసుకొస్తానని విజయరాజు తెలిపారు.





రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న ఖైరతాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వెంకటేష్ ధోత్రే

## 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

### రిటర్నింగ్ ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే

బంజారాహిల్స్,అక్టోబర్ 31: అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ ప్రక్రియ నవంబర్ 3న ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని రాజకీయ పార్టీలతో రిటర్నింగ్ అధికారి వెంకటేష్ ధోత్రే సమావేశమయ్యారు. నామినేషన్ ప్రక్రియతో పాటు జత పర్చాల్సిన పత్రాలు, నామినేషన్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

- నవంబర్ 3నుంచి 10 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు.
- ప్రతిరోజూ ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ ఎన్నికల అధికారి కార్యాలయంలో నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు.
- నామినేషన్ సందర్భంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరపున పోటీచేసే అభ్యర్థులు ఫామ్–ఏ, ఫామ్–బీలను సమర్పించాల్సి ఉంటుందన్నారు.
- నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతి ఇస్తారని, అభ్యర్థి వాహనంతో పాటు మరో రెండు వాహనాలు మాత్రమే కాన్వాయ్‌లో రావాల్సి ఉంటుందన్నారు.
- నామినేషన్ సమయంలో ఎలాంటి ర్యాలీలు, నినాదాలకు అనుమతి ఉండదని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడడంలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌వో ప్రశాంతి, అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ కృషి

హిమాయత్‌నగర్,అక్టోబర్31: గాజాపై ఇజ్రాయిల్ చేసే దాడులను ఆపివేయించి శాంతిని నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్ ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏఐటీయూసీ 104 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాలస్తీనాలో శాంతి ,సంఘీభావం–ఎన్నికలు,కార్మికుల పాత్ర అనే అంశంపై మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డి భవన్‌లో సదస్సు జరిగింది.ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ అమెరికా సహకారంతో గాజాపై ఇజ్రాయిల్ దాడి చేయడం తో అమాయక ప్రజలు మృతి చెందడంతో పాటు ఆస్తి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రముఖ కవి,గాయకుడు జయరాజ్ మాట్లాడుతూ దేశంలోని కార్మికవర్గం ముందు అనేకసవాళ్లు ఉన్నాయని,ఐక్య ఉద్యమాలతో ప్రభుత్వ సంస్థలు, హక్కులను కాపాడు కోవాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్,రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.నరసింహ,నాయకులు వీఎస్.బోస్, పి.ప్రేంపావని,కె.ఏసురత్నం, బి.వెంకటేశం, కరుణకుమారి, కమతం యాదగిరి, బి.కిషన్,లక్ష్మిబాయి, హసీనా బేగం, దానం శేఖర్,జైపాల్‌రెడ్డి, భిక్షపతి యాదవ్, ఉమర్‌ఖాన్,వేణుమాధవ్ పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

హిమాయత్‌నగర్,అక్టోబర్31: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వల్లీ ఉల్లాఖాద్రీ,రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.వెంకటేశ్వర్లు, టి.సత్యప్రసాద్, శ్రీనివాస్,యుగేందర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, సహాయ కార్యదర్శులు రామకృష్ణ,లింగం రవి,శంకర్,కోశాధికారి మహేందర్,ఆహ్వానితులు శ్రీమాన్,కొండల్‌తో పాటు 25మంది కార్యవర్గ సభ్యులు,65 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.